క్లుప్తంగా...

కరెంటు ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్లపల్లి సబ్‌స్టేషన్‌–2 పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎం.పృథ్వీరాజ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ నాగారం ఫీడర్ పరిధిలోని రెడ్డికాలనీ, భగవాన్‌కాలనీ, చక్రిపురంకాలనీ, కట్టింగ్‌కాలనీ, టీచర్స్‌కాలనీ, మారుతీకాలనీ, గాంధీనగర్, మధురానగర్, ద్వారకాపురికాలనీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11కేవీ సంతోషీమానగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల వలన నలంద హైస్కూల్ ఏరియా, గంగపుత్ర సంఘం, డీఏవీ స్కూల్ ఏరియా, సంతోషిమానగర్, డీమార్ట్ ఏరియాలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ యాదగిరి తెలిపారు. 11 కేవీ ఈస్ట్ చంద్రగిరి కాలనీ ఫీడర్ పరిధిలోని లాల్ వాణీనగర్, జైన్ మందిర్ ఏరియా, శివగౌరి ఎన్‌క్లేవ్, చంద్రగిరి కాలనీ, నవభారత్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉప్పల్: హబ్సిగూడలో విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా హబ్సిగూడ సెక్షన్ రాఘవేంద్రనగర్ ఫీడర్ 33/11 కేవీ, వీధి నంబర్‌–8 సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాఘవేంద్రనగర్ వీధి నంబర్ 6 నుంచి 17 వరకు, సాయిబాబా దేవాలయం రోడ్డులో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ రాంరెడ్డి తెలిపారు.

అమ్మవారి ఘటం ఊరేగింపు



రామంతాపూర్: దూరదర్శన్ కేంద్రం నల్ల పోచమ్మ ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరిన అమ్మవారి ఘటం పలు పురవీధుల్లో ఊరేగిస్తూ గురువారం రామంతాపూర్ ఇందిరానగర్, నెహ్రూనగర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు భక్తులు అమ్మవారి ఘటానికి భక్తితో సాకపోసి చల్లగా చూడాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో ఘటం నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

అభినందనలు



గౌతంనగర్: కాంగ్రెస్ నేత, సీఎల్పీ నాయకుడు మల్లు భట్టివిక్రమార్కను గురువారం మల్కాజిగిరికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత బోనగిరి సురేష్‌యాదవ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పీపుల్స్ మార్చ్ పేరుతో 1,350 కిలోమీటర్ల పాదయాత్ర 100 రోజుల్లో పూర్తి చేసిన సందర్భంగా ఆయనను అభినందించారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎన్నో సంక్షేమ పథకాలు



వెంకటాపురంలో సమస్యలు తెలుసుకుంటున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. కాలనీ నేస్తం.. కాంగ్రెస్ హస్తం కార్యక్రమంలో భాగంగా గురువారం వెంకటాపురం డివిజన్ పరిధిలోని మారుతినగర్ నుంచి ఆయన పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నిమ్మ అశోక్‌రెడ్డి, కృష్ణగౌడ్, చంద్రశేఖర్, శ్రీనివాస్, సంజీవ్‌కుమార్, సాయికుమార్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన మైసమ్మ తల్లికి పూజలు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ బీపీఎం కాలనీలో గురువారం బల్లెపు నర్సింగ్‌రావు, రమేష్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వన మైసమ్మ తల్లికి ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేశగోని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మున్సిపల్ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు చింతల నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి పాశం రాజుయాదవ్, బీసీ సెల్ అధ్యక్షుడు దుబ్బాక జైహింద్‌గౌడ్, శ్రీనునాయక్, నాగిరెడ్డి తదితరులు అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు.

తడ'బడి'తే.. సరిదిద్దేవారేరీ..?



- శిథిలావస్థకు చేరిన సర్కారు బడి
- పెచ్చులూడి పడుతున్న పైకప్పు
- వర్షంతో గోడలు కారుతున్నాయి
- ఒకటి నుంచి 5 వరకు ఒకటే గది
- బడంటే భయపడుతున్న విద్యార్థులు
- ప్రభుత్వ స్కూల్‌పై ఏళ్లుగా నిర్లక్ష్యం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

కాప్రా: ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతూ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామనే ప్రభుత్వ మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. ఇందుకు కాప్రా డివిజన్ ఎల్లారెడ్డిగూడ ప్రాథమిక స్కూల్ నిలువెత్తు నిదర్శనం. ప్రతి విద్యా సంవత్సరం ఆరంభంలో పాఠశాలల భవనాలకు నిధులు విడుదల చేస్తూ విద్యాశాఖ అభివృద్ధి చేస్తోంది. కానీ ఆ అభివృద్ధిలో ఈ స్కూల్‌కు ఎందుకు అవకాశం రావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి.. నేతలు మారుతున్నారు.. అధికారులు మారుతున్నారు.. 1970లో నిర్మించిన ఈ ఎల్లారెడ్డిగూడ ప్రాథమిక స్కూల్ మాత్రం మారడంలేదు.

శిథిలావస్థకు చేరుకున్న స్కూల్..

ఎల్లారెడ్డిగూడ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. స్కూల్ పైకప్పు పెచ్చులూడుతుంది. వర్షాలకు గోడల నుంచి నీళ్లు కారుతూ క్లాస్ రూంలు కుంటలను తలపిస్తున్నాయి. గోడలకు పాచి పేరుకుపోయి పాడుబడ్డ భవనం మాదిరిగా తయారైంది. చలికాలం, ఎండా కాలంలో ఎలాగోలా విద్యార్థులు కాలం వెళ్లదీశారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు.

బడి అంటేనే భయపడుతున్నారు..

ఎల్లారెడ్డిగూడలో బడి అంటేనే పేద పిల్లలు భయపడుతున్నారు. కార్పొరేట్ ఫీజులు చెల్లించే స్థోమత లేక ప్రభుత్వ స్కూల్‌కు పంపాలనుకుంటే అక్కడ శిథిలావస్థకు చేరిన స్కూల్ భవనంలో ప్రాణభయం ఉందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు తల్లిదండ్రులు. బంగారు భవిష్యత్‌కు అక్షరాలు నేర్చుకుందామనుకుంటే.. ఎల్లారెడ్డిగూడ స్కూల్‌కు వెళ్తే అసలు భవిష్యత్తే ఉండదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని తరగతులకు ఒకే హాల్..

ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులందరికీ ఈ స్కూల్‌లో ఒకే హాల్ దిక్కైంది. స్కూల్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థుల భోజన వసతి కోసం దాతలు నిర్మించిన డైనింగ్ హాలే తరగతి గదిలా మారిపోయింది. విద్యార్థుల భోజన సౌకర్యం కోసం గతంలో ఈసీఐఎల్ వారి ఆర్థిక సహకారంతో ఓ డైనింగ్ హాల్‌ను నిర్మించారు. ప్రస్తుతం ఈ డైనింగ్ హాలే ఐదు తరగతుల విద్యార్థులకు దిక్కైంది. చిన్నపాటి వర్షానికే స్కూల్ ఆవరణలో నీరు నిలిచి చెరువును తలపించేంది. ఈ విషయం గమనించిన ఓ దాత దాదాపు రూ.1.50 లక్షల ఖర్చుతో స్కూల్ ఆవరణలోని కొంతభాగంలో బండలు వేశారు. వర్షం రాకుంటే కొందరు ఈ ఆరుబయట బండలపై.., ఇంకొందరు డైనింగ్ హాల్‌లో విద్యనభ్యసిస్తున్నారు.

తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

ఎల్లారెడ్డిగూడ ప్రాథమిక స్కూల్‌లో గతేడాది 85 మంది విద్యార్థులు ఉండేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 60కి తగ్గిపోయింది. దీనికి ముఖ్య కారణం శిథిలావస్థకు చేరుకున్న స్కూల్ భవనమే. పిల్లలను స్కూల్‌కు పంపితే ఎప్పుడు ఏ వినకూడని వార్త వినాల్సి వస్తుందోననే భయంతో తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపడం మాన్పించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే నూతన భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





శిథిలావస్థకు చేరుకున్న ఎల్లారెడ్డిగూడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

సమస్యల పరిష్కారమే ధ్యేయం



కాప్రా డివిజన్‌లో ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి పాదయాత్ర

ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

కాప్రా: మీ కోసం మీ ఎమ్మెల్యే పాదయాత్రలో భాగంగా గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ స్వర్ణరాజ్‌తో కలిసి కాప్రా డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో కందిగూడలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నూతన రోడ్లు, తాగునీరు, విద్యుత్ సమస్య పరిష్కరించాలని, ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రహరీ నిర్మించాలని, మురుగు కాల్వల నుంచి తీసిన వ్యర్థాలను తొలగించాలని, పారిశుద్ధ్య నిర్వహణ చేయాలని, పార్కు అభివృద్ధి చేయాలని కాలనీవాసులు సమస్యలు తెలుపుతూ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారమే ధ్యేయమన్నారు. పాదయాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. సమస్యలను అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని అధికారులకు ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సుడుగు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గిల్‌బర్ట్, నాయకులు కాసం మహిపాల్‌రెడ్డి, జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్, రఘుపతిరెడ్డి, బేతాళ బాలరాజు, ఏనుగు సీతారాంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శైలేష్‌రెడ్డి, బద్రుద్దీన్, పవన్, పాండు, కొండల్‌గౌడ్, మల్లారెడ్డి, గణేష్, భిక్షపతి, చందు, గౌస్, సుశీల్, సంతు, బబ్లు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమ పథకాల అమలే ఏజెండాగా తీసుకొని రాజకీయాలకు తావులేకుండా అన్ని డివిజన్లకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. గురువారం కాప్రా డివిజన్ ఎల్లారెడ్డిగూడ శిరిడీనగర్‌లో రూ.30 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ స్వర్ణరాజ్, జలమండలి డీజీఎం సతీష్‌కుమార్, ఏఈ రోహిల్, కాలనీవాసులు రిజ్వాన్‌ఖాన్, సత్తయ్య, స్వామిగౌడ్, చెన్నారెడ్డి, వెంకటరాంరెడ్డి, సత్తిరెడ్డి, మౌలాలి, వేణుగోపాల్, రాము యాదవ్, కుశాల్, సుకుమారి, గోవింద్, నాయకులు సుడుగు మహేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, గిల్‌బర్ట్, పవన్, సుశీల్, శివ తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ స్వర్ణరాజ్

నేడు సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ

అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని కల్లు కాంపౌండ్ వద్ద శుక్రవారం బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న నూతన విగ్రహావిష్కరణ ఉందని నిర్వాహకులు తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం ప్రతినిధి నేమూరి సాయిరామ్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరుకానున్నట్లు తెలిపారు.

సీనియర్ సిటిజన్స్ భవనానికి స్థలం ఇవ్వండి

హబ్సిగూడ: సీనియర్ సిటిజన్స్ భవనం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.నర్సింహారావు ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ సభ్యులు నరసయ్య, కుమారస్వామి, చంద్రశేఖర్, లక్ష్మణరావు, నరేంద్ర, రామకృష్ణ, ప్రతాపరెడ్డి, మధుసూదన్‌రావు, కిషన్‌రావు పాల్గొన్నారు.

భగాయత్ లే అవుట్‌లో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: హబ్సిగూడలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అధ్యక్షతన జలమండలి, హెచ్ఎండీఏ అధికారులు, ఉప్పల్ భగాయత్ లేఅవుట్ అసోసియేషన్ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ డివిజన్‌లోని భగాయత్ లే అవుట్‌లో డ్రైనేజీ, తాగునీరు సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి సీజీఎం నాగేందర్, జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం రజనీకాంత్‌రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, హెచ్ఎండీఏ అధికారులు డీఈ అరుణ, ఏఈ వెంకటేష్, చందు, భగాయత్ లేఅవుట్ అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూదన్‌రెడ్డి, గోనే అర్జున్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, ప్రభాకర్, శ్రీను, సిద్దు, మాజీ రైతు సంఘం సభ్యులు దుబ్బ నర్సింహారెడ్డి, సల్ల రాజరెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడి భూకబ్జాలు నిజం కాదా?



మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంజరి సంతోష్

- దమ్ముంటే చిలుకానగర్ గడ్డపై చర్చిద్దాం
- రాగిడి లక్ష్మారెడ్డిని విమర్శించే స్థాయి లేదు
- బీఆర్‌ఎస్ నేతలకు కాంగ్రెస్ నేతల సవాల్

ఉప్పల్: రాగిడి లక్ష్మారెడ్డిని విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్ నేతలకు లేదని మేడ్చల్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంజరి సంతోష్, ఉప్పల్ ఎస్సీసెల్ చైర్మన్ హెచ్ఆర్ మోహన్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే అభివృద్ధి చేస్తే మల్లాపూర్ అశోక్‌నగర్ కాలనీవాసులు ఎందుకు తిరగబడతారని గుర్తు చేశారు. సర్వే నంబర్‌– 51 చిలుకానగర్‌లో ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు భూకబ్జాకు పాల్పడటం నిజం కాదా? సర్వే నంబర్ 793, 789లలో భూకబ్జాలు నిజం కాదా..? దమ్ముంటే చిలుకానగర్ గడ్డపై దీనిపై చర్చిద్దామని బీఆర్‌ఎస్ నేతలకు సవాల్ విసిరారు. 25 ఏళ్లుగా ఉప్పల్ నియోజకవర్గంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు బీఆర్‌ఎస్ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీకి, రాగిడి లక్ష్మారెడ్డికి వస్తున్న ఆదరణను బీఆర్‌ఎస్ నేతలు జీర్ణించుకోలేక ఆరోపణలు చేస్తున్నారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ నియోజవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేసేది రాగిడి లక్ష్మారెడ్డి అని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నేతలు రాగిడి లక్ష్మారెడ్డి జోలికి వస్తే ఖబడ్దార్ అని వారు హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో యువజన కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సాయిబాబా, యువజన నాయకుడు శ్రవణ్ కుమార్, అమీర్ తదితరులు ఉన్నారు.

టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా శ్రీనివాసరావు

గౌతంనగర్: టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా గౌతంనగర్‌కు చెందిన ఎడ్ల శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ శ్రీనగరిగారి ప్రీతం విడుదల చేసిన నియామకపత్రాన్ని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ గురువారం శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎడ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర చైర్మన్ శ్రీనగరిగారి ప్రీతం, డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్, మల్కాజిగిరి బీ–బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ బలోపేతంతో పాటు రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రవీణ్, మురళి, డేవిడ్, ప్రకాష్, భరత్‌రెడ్డి, సతీష్, షేక్, జానయ్య, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ బ్యాగులు వాడొద్దు..

కాప్రా: ఈసీఐఎల్ రవీంద్రభారతి స్కూల్ విద్యార్థులు గురువారం ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ హాజరై ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ బ్యాగుల వినియోగాన్ని నిషేధించాలని, జ్యూట్ బ్యాగులనే వాడాలన్నారు. పాఠశాల డివిజనల్ ఇన్‌చార్జి క్రాంతికుమార్, ప్రిన్సిపల్ లలిత మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పర్యావరణాన్ని ప్లాస్టిక్ భూతం నుంచి కాపాడాలి

మేడిపల్లి: రవీంద్రభారతి స్కూల్ బోడుప్పల్ బ్రాంచిలో భూమి వారోత్సవాల్లో భాగంగా గురువారం విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగించడం తగ్గిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం.. అంటూ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయురాలు విజయభాను మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని ప్లాస్టిక్ భూతం నుంచి కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డీఐ క్రాంతికుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బద్రీనాథ్ ఆలయానికి బస్సులు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ సమీపంలోని గజ్వేల్ నియోజకవర్గ పరిధి బండమైలారం గ్రామంలో నూతనంగా నిర్మించిన బద్రీనాథ్ ఆలయానికి మేడ్చల్ డిపో నుంచి బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటల నుంచి బస్సు సర్వీసులు ప్రారంభమై ప్రతి 50 నిమిషాలకు ఒక బస్సు నడపనున్నట్లు తెలిపారు. ఆలయం నుంచి రాత్రి 7.20 వరకు బస్సు అందుబాటులో ఉంటుందని వివరించారు. రూ.30 బస్‌చార్జీ ఉంటుందని, ఆలయాన్ని సందర్శించే భక్తులు, ప్రయాణికులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

త్వరలోనే సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రాఘవేంద్రనగర్ కాలనీలో రోడ్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్, అన్నపూర్ణ కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభమవుతాయని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జెన్‌శేఖర్ అన్నారు. గురువారం నాచారం రాఘవేంద్రనగర్, అన్నపూర్ణ కాలనీలో కార్పొరేటర్ పర్యటించారు. ఆగిపోయిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీజీఎం సతీష్‌ను కోరారు.

లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు దేవాదాయశాఖ అధికారి మధుబాబు ఆధ్వర్యంలో జరిగింది. 48 రోజుల హుండీ లెక్కింపు ద్వారా రూ.2.92 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వెంకటరమణాచార్యులు, తులసి రమణాచార్యులు, వాణీనగర్ వినాయక దేవాలయం ఈవో వెంకన్న, క్లర్క్ సుధాకర్, పూర్వ కమిటీ చైర్మన్లు ఉమేష్‌సింగ్, సంతోష్, సభ్యులు కన్నా, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణానికి విరాళం



స్పీకర్ పోచారంతో కలిసి విరాళాన్ని అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ శివసాయినగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి బీఎల్ఆర్ ట్రస్టు చైర్మన్, బీఆర్‌ఎస్ నేత బండారి లక్ష్మారెడ్డి విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు గురువారం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేతులమీదుగా కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులకు చెక్కును అందజేశారు. పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న బీఎల్ఆర్ ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి స్పీకర్ అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు నేమూరి మహేష్‌గౌడ్, శివసాయినగర్ కాలనీ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి, నార నర్సింహులు, షాబాద్ దామోదర్‌రెడ్డి, కాసుల రమేష్‌రావు, కృష్ణ, సరికొండ రమేష్, పురుషోత్తం, సత్యనారాయణరెడ్డి, రామచంద్రరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం

బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందిన మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ ఓల్డ్ మీర్‌పేట్‌కు చెందిన ఉదయ్‌కుమార్ కుటుంబ సభ్యులను గురువారం బీఎల్ఆర్ ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి పరామర్శించారు. ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రాకేష్, రాజు, శ్యాం, కుందన్, దయానంద్, మన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో పూజలు

మేడిపల్లి: పర్వతాపూర్ సత్యనారాయణపురంలో శ్రీనల్లపోచమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు జేఎస్ఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్, కాలనీవాసుల సహకారంతో పనులు చేపడుతున్నారు. ఈ సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీర్జాదిగూడ నగరపాలక మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, స్థానిక కార్పొరేటర్ శారద ఈశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ కొడె పోచయ్య, బచ్చ రాజు, కో ఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామదేవతల చల్లని చూపులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామదేవతను భక్తిశ్రద్ధలతో పూజిస్తే ఎటువంటి చీడపీడలు, దృష్టశక్తులు దరిచేరవన్నారు. జేఎస్ఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్‌ను అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కె.మల్లారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెల్లంకి శశిధర్‌రెడ్డి, ధీరజ్‌రెడ్డి, జేఎస్ఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రతినిధులు కొత్త రఘురాంగౌడ్, జాలపు శ్యామ్‌సుందర్‌రెడ్డి, డి.నర్సయ్యగౌడ్, వెంకటేష్, కాలనీవాసులు ప్రతాప్‌రెడ్డి, ధనుంజయ్‌గౌడ్, పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని కాలనీలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీల్లో యూజీడీ, తాగునీటి సరఫరా పైపులైన్ పనులు పూర్తయిన తర్వాత సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. వర్షాకాలంలో త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వీఏ రజనీకాంత్, సంపత్, కిషోర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి

కీసర: కీసర మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులతో పాటు అన్ని రకాల శాఖల సిబ్బందికి మండల వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలి స్పృహ కోల్పోయిన వ్యక్తులకు వెంటనే సీపీఆర్ చేస్తే ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, హెల్త్ డిపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్ సూర్యకాంత, ఏఎన్ఎం రాణి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.